క్లుప్తంగా

నవనీత కృష్ణ..వేంకటేశ్వర



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా నవనీత కృష్ణుడిగా శ్రీవారు దర్శనమిచ్చారు. 25 కేజీల వెన్నతో ప్రత్యేక అలంకరణలు చేశారు. మహిళా భక్తుల ఆధ్వర్యంలో ఉట్టి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రెడ్డి బంగారయ్య, కోటేశ్వరరావు, అర్చకులు శ్రీనివాసుల శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



నరసరావుపేట రూరల్: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ పి.మస్తానమ్మ హెచ్చరించారు. పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో మంగళవారం ఆమె తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి, ఈ-పాస్‌లో వ్యత్యాసాలను గుర్తించారు. పలు దుకాణాల్లో దాదాపు రూ.2 లక్షల విలువైన ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఎరువుల యజమానులు తప్పనిసరిగా ఈ-పాస్ ద్వారానే విక్రయాలు జరపాలని స్పష్టం చేశారు. దుకాణాల ఎదుట స్టాక్ బోర్డులు ఏర్పాటుచేయాలని తెలిపారు. లేకుంటే విక్రయాలు నిలిపివేస్తామని హెచ్చరించారు.

వేణుగోపాలస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే సతీమణి



నాదెండ్ల: యడ్లపాడు మండలం చెంఘీజ్ ఖాన్ పేటలో కొలువైయున్న శ్రీ వెన్నముద్ద వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకటకుమారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు సత్యనారాయణచార్యులు పూజలు నిర్వహించి, ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం టీడీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేశారు.

క్యాన్సర్ చికిత్సకు ఆర్థిక సాయం



నరసరావుపేట: పట్టణానికి చెందిన షేక్ కరిముల్లా కుమారుడు షేక్ గౌస్ (ఎనిమిదో తరగతి) బాలుడు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. చికిత్స కోసం డాక్టర్లు రూ.లక్షలు ఖర్చు అవుతుందని చెప్పడంతో అంత భరించే శక్తి లేని తల్లితండ్రులు దాతల సహకారం కోరారు. దీనికి స్పందించిన మా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు స్వర్ణ నాగరాజు సోషల్ మీడియా ద్వారా పట్టణంలోని ప్రముఖులు, వ్యాపారులకు విషయం తెలియజేశారు. స్పందించిన పలువురు దాతల సహకారంతో రూ.70 వేలను మంగళవారం గౌస్ కుటుంబ సభ్యులకు అందించారు. ఆర్థిక సాయం అందజేసిన ప్రతి ఒక్కరికి బాలుడి తల్లితండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

విద్యుదీకరణ పనులకు శంకుస్థాపన

సత్తెనపల్లి: పట్టణంలోని ఏపీ టిడ్కో గృహ సముదాయం వద్ద విద్యుదీకరణ పనులకు స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజ నిర్వహించారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో సెక్యూరిటీ పెంచాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని ఖండిస్తున్నాను. మా డాక్టర్స్ తరపున నిరసన కూడా తెలియజేశాం. వినుకొండ సీహెచ్‌సీలో ముగ్గురు మహిళా వైద్యులు పనిచేస్తున్నారు. హాస్పిటల్‌లో కేవలం ముగ్గురు మాత్రమే సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు. ఒక రోజులో ఒక్కరే డ్యూటీలో ఉంటున్నారు. ఎదైయినా ఘటన జరిగితే కంట్రోల్ చేయడం కష్టంగా మారింది. రోజూ ముగ్గురు సెక్యూరిటీ సిబ్బంది ఉంటే ఇబ్బంది ఉండదు.

– డాక్టర్ అబ్దుల్ రజాక్, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, వినుకొండ



మహిళా వైద్యులకు భద్రత పెంచాలి



వైద్యులకు, వైద్య సిబ్బందికి నూరు శాతం రక్షణ కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో మెడికల్ కాలేజీ వైద్యురాలిపై హత్యాచారం దుర్మార్గపు చర్య . ఇలాంటి దుశ్చర్యలకు అడ్డుకట్ట వేయాలంటే ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. మహిళా వైద్యులకు భద్రత కల్పించే విషయమై శ్రద్ధ చూపాలి. రాత్రి వేళల్లో బీట్ కానిస్టేబుల్ వైద్యశాలలకు రక్షణగా ఉండాలి. స్త్రీలను గౌరవించే సంస్కృతి అందరిలోనూ రావాలి.

–డాక్టర్ విద్య, సీహెచ్‌సీ, సూపరింటెండెంట్, పెదకూరపాడు

విద్యుత్ స్మార్ట్ మీటర్లతో ప్రజలపై భారం

చిలకలూరిపేట: విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజల మీద భారం మోపేందుకు సిద్ధమవుతోందని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామ సుబ్బాయమ్మ, సీపీఎం పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు విమర్శించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఉభయ కమ్యూనిస్టు పార్టీల నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఒకలా, ఎన్నికల తర్వాత మరోలా మాట్లాడటం పాలకుల ద్వంద వైఖరికి అద్దం పడుతోందన్నారు. స్మార్ట్ మీటర్ల అంశంపై గురువారం ఉదయం 10 గంటలకు సీపీఐ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వామపక్ష, రాజకీయ, దళిత, బహుజన, విద్యార్థి, యువజన, కార్మిక సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పేలూరి రామారావు, బి.భగత్‌సింగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

విద్యుత్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలి

నరసరావుపేట రూరల్: రైతులపై భారం మోపే వ్యవసాయ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని పీడీఎం నాయకులు వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, బీసీ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. వ్యవసాయ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని వ్యవసాయ మార్కెట్ వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ మీటర్లకు తమ పార్టీ వ్యతిరేకమని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు ప్రకటించారని, అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వ విధానాలనే కొనసాగించడం రైతులను మోసం చేయడమేనన్నారు. ఇలాంటి చర్యలను ప్రభుత్వం మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పీడీఎం నాయకులు

ఉపాధ్యాయురాలికి సత్కారం

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం విద్యాశాఖ ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి సందర్శించారు. పాఠశాలలో 850 మందికి పైగా విద్యార్థులు లూసిడా చేతిరాతలో రాణిస్తుండటంతో శిక్షణ నిచ్చిన ఆంగ్ల ఉపాధ్యాయని నాగశైలజారాణిని అభినందించారు. ఆమె పొత్తూరు ఉన్నత పాఠశాలలో గణిత అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రామ్మోహన్‌రావు వద్ద లూసిడా చేతిరాతను నేర్చుకున్నారు. ఆపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 30 పని దినాల్లో నేర్పారు. ఆమె కృషిని ఆర్జేడీ అభినందించి, శాలువాతో సత్కరించారు. విద్యార్థి దశలో చేతిరాత కీలకమైనదని, చిన్నతనం నుంచే చక్కగా అలవర్చుకుంటే భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందన్నారు. హెచ్ఎం కృష్ణానాయక్, ఇన్‌చార్జి హెచ్ఎం ఉషారాణి, ఎన్‌సీసీ అధికారి మహమ్మద్ రసూల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నాగశైలజారాణిని సత్కరిస్తున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

అడవి జాతి మొక్కలతో లాభాలు

బొల్లాపల్లి: వ్యవసాయ భూమిలో ఉద్యాన, అడవి జాతి మొక్కల పెంపకం రైతులకు ఎంతో ఉపయోగకరమని విజయవాడ టీఓఎఫ్ఐ అసోసియేట్ చీఫ్ ఆఫ్ పార్టీ బాల చిన్నపరెడ్డి తెలిపారు. మండలంలోని రావులాపురం గ్రామంలో వినుకొండ ఉద్యాన శాఖ అధికారి షేక్ నబీ రసూల్ ఆధ్వర్యంలో అటవీయేతర ప్రాంతంలో మొక్కల పెంపకంపై మంగళవారం అవగాహన కల్పించారు. బాల చిన్నపరెడ్డి, నబీ రసూల్ మాట్లాడుతూ ఆగ్రో ఫారెస్ట్రీపై అవగాహన కల్పించారు. టేకు, వేప, చందనం, మహాగని, వెదురు వివిధ అడవిజాతీ మొక్కలు, ఉద్యాన వన మొక్కలను వ్యవసాయ భూమిలో ఎలా నాటాలి, దాని వల్ల వచ్చే ఉపయోగాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎ.పున్నారెడ్డి, టీవోఎఫ్ఐ ప్రోగ్రాం స్టేట్ కో-ఆర్డినేటర్ అజిత్, స్టేట్ అసోసియేట్ ప్రణీత్ వర్మ, విలేజీ హార్టి కల్చర్ అసిస్టెంట్ ఎం.గురునాథం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాల చిన్నపరెడ్డి

నేత్రదానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

అమరావతి: ప్రతి ఒక్కరికి నేత్రదానంపై అవగాహన అవసరమని మండల నేత్ర వైద్యాధికారి పివిడి శివరామ సుబ్బారావు అన్నారు. మంగళవారం నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని అత్తలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నేత్రదాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో శివరామసుబ్బారావు మాట్లాడుతూ మన దేశంలో నేత్రదానం కోసం సుమారు 11 లక్షల మంది ఎదురు చూస్తున్నారని వారిలో అత్యధికంగా చిన్నారులే ఉన్నారని, ప్రతి యేటా మరో 25 వేల చిన్నారులు పెరుగుతూనే ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన ఏర్పరుచుకుని కళ్ల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలన్నారు. నేత్రదానం 3 సంవత్సరాల చిన్నారుల మొదలు 70 సంవత్సరాల వృద్ధులు వరకు చేయవచ్చన్నారు. నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా నేత్ర సంబంధమైన వ్యాధులు, నేత్రదానంపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించేందుకు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నేత్రదానంపై అవగాహన ఏర్పరచే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అత్తలూరు పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అత్తలూరు పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామస్తులు

కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి

పీహెచ్‌సీ వైద్యాధికారి కోటేశ్వరరావు

బెల్లంకొండ: సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతుండడంతో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కేవీ కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని వన్నాయపాలెం గ్రామంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 143 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వారిలో 11 మంది జ్వర పీడితులకు రక్త పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేసినట్లు తెలియజేశారు. ఒంటి నొప్పులతో బాధపడుతున్న 72 మంది రక్త నమూనాలను సేకరించినట్లు పేర్కొన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ తెరలను వాడాలని సూచించారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయించినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. వైద్య శిబిరంలో సూపర్ వైజర్ బాషా, ఎంఎల్‌హెచ్‌పీ సుభాని, ఏఎన్ఎం ఎలిజబెత్ రాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



రోగితో మాట్లాడుతున్న వైద్యులు కోటేశ్వరరావు

నర్సింగపాడులో వైద్య శిబిరం



నకరికల్లు: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నకరికల్లు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ మణికంఠ సూచించారు. నకరికల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని నర్సింగపాడు గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో మార్పుల వలన జలుబు, దగ్గు, ఒంటి నొప్పులు, జ్వరం లాంటి అనారోగ్య సమస్యలు ఉంటాయన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. సురక్షిత మంచి నీటినే తాగాలన్నారు. వేడి ఆహార పదార్థాలు భుజించాలని అన్నారు. చిన్నపాటి జలుబు, జ్వరం ఉన్నప్పటికీ వైద్యుల సలహా మేరకు మందులు వాడాలన్నారు. పీహెచ్‌సీలో రక్త నమూనాలు సేకరించి మందులు ఉచితంగా అందజేస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ విజయమ్మ, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

శావల్యాపురం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు అందరూ హాజరు కావాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిలకలూరిపేట: విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా బుధవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు యడ్లపాడు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని కొండవీడు, చెంఘీజ్‌ఖాన్ పేట, సొలస, లింగారావుపాలెం, వంకాయలపాడు, పుట్టకోట గ్రామాల్లో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. జ

పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు

చిలకలూరిపేట: పురపాలక సంఘ పరిధిలో ఆవులు, పందులు, ఇతర పంపెడు జంతువులను వాటి యజమానులు తమ ఇంటి పరిసరాల్లోనే కట్టడి చేసుకోవాలని, రోడ్ల మీదకు వదిలితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రధాన రోడ్లపై ఆవులను ఇష్టానుసారం వదిలివేయడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని సమయాల్లో ప్రమాదాలకు కారణం అవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల ప్రకారం పందుల పెంపకం దారులు పురపాలక సంఘం నుంచి లిఖిత పూర్వక అనుమతులు కలిగి ఉండాలని చెప్పారు. అలా కాకుండా ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా నివాస ప్రాంతాలు, ప్రాంగణాల్లో మందులను పెంచరాదని తెలిపారు. ఆవులు, పందులు, పెంపుడు కుక్కలు రోడ్లమీదకు వదిలితే సెప్టెంబర్ పదో తేదీ నుంచి వాటిని పురపాలక సిబ్బంది స్వాధీనం చేసుకొని పశువుల దొడ్డికి తరలించి, యజమానులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

చల్లగా చూడమ్మ పోలేరమ్మ తల్లి

పెదకూరపాడు: చల్లగా చూడమ్మ పోలేరమ్మ తల్లి అంటూ భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని కోర్కెలు తీర్చే తల్లి పోలేరమ్మ దేవాలయం వార్షికోత్సవం అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల్లో మహిళలు అనేక మంది తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పొంగళ్లను సమర్పించారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

మన గ్రోమోర్‌లో ఆకస్మిక తనిఖీలు

నకరికల్లు: నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు ఆదేశించారు. స్థానిక మన గ్రోమోర్ కేంద్రంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా పురుగు మందుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్ పరిశీలించారు. పురుగు మందుల నిల్వల్లో మూడు రకాల పురుగు మందుల నమూనాలు సేకరించి నాణ్యతా ప్రమాణాల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులకు విక్రయించే సమయంలో లోపాలు లేకుండా చూసేందుకు నిరంతరం క్రయ విక్రయాలపై నిఘా పెట్టామన్నారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని చీకటీగలపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ విజయలక్ష్మి అధ్యక్షతన స్టాప్ డయేరియా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టి.వీరభద్రాచారి పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. డాక్టర్ బి.రామానాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కడుపు నొప్పి వచ్చినప్పుడు, కడుపులో వికారం మొదలగు సూచనలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తినకూడదన్నారు. కార్యక్రమంలో ఐటీసీ సెర్ప్ కో-ఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు, సీహెచ్‌వో ఝాన్సీ, ఎంఆర్‌సీ ప్రభాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వీరభద్రాచారి

బీజేపీ సభ్యత్వ నమోదు

చిలకలూరిపేట: బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా సభ్యత్వ నమోదు ప్రముఖ్ పోత్రు పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం యడ్లపాడు మండల పరిధిలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి కార్యకర్త మరికొందరిని పార్టీలో చేర్చేందుకు ప్రయత్నించాలన్నారు. నియోజకవర్గ కన్వీనర్ తాటిపర్తి జయరామిరెడ్డి మాట్లాడుతూ 100 మందిని సభ్యులుగా చేర్చడం ద్వారా క్రియాశీల సభ్యత్వానికి అర్హత సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు తులాబంధుల సత్యనారాయణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో దాట్ల వెంకటేశ్వరరాజు, ఐలవరపు రామారావు, వేగేశ్న అంజిరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోత్రు పూర్ణచంద్రరావు

ఏఐటీయూసీ సమ్మేళనాల జయప్రదానికి పిలుపు

వినుకొండ(నూజెండ్ల): విశాఖపట్నంలో సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని శివయ్య భవన్‌లో యూనియన్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికుల హక్కులను కాలరాయటమే ధ్యేయంగా పనిచేస్తోందని విమర్శించారు. స్కీమ్ వర్కర్లు, ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, స్వచ్ఛ భారత్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ ఎస్.అబ్రహం, ఏసుపాదం, పి.ఏసు, సుబేదార్, యూనుస్, కె.మల్లికార్జున, కె.నవీన్, వెంకటేశ్వర్లు, దావీదు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బూదాల శ్రీనివాసరావు

క్లాప్ మిత్రలకు అవగాహన కార్యక్రమం

క్రోసూరు: ఐటీసీ బంగారు భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య బీమా, ఆర్థిక అక్షరాస్యత అంశాలపై మండల క్లాప్ మిత్రలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐటీసీ సెర్ప్ ప్రతినిధి ఎన్.సతీష్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్, పీఎం జేజేవై, పీఎం ఎస్‌బీవై వంటి జీవిత బీమా పథకాల ద్వారా గ్రామాలలోని పేదలకు ఆరోగ్యం, బీమా ప్రయోజనాలు ఏ విధంగా కలుగుతాయో తెలిపారు. దాంతో పాటు పీఎం ముద్ర యోజన, పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవన జ్యోతి బీమా యోజన ప్రయోజనాలను వివరించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ప్రయోజనం పొందడంతో పాటు ప్రతి ఒక్కరు పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అన్ని పంచాయతీల క్లాప్ మిత్రలు, ఐటీసీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సీహెచ్ బొల్లయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీసీ సెర్ప్ ప్రతినిధి సతీష్

తారకరామ చెరువును నింపండి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య

సత్తెనపల్లి: పట్టణంలోని తారకరామ చెరువును సాగర్ జలాలతో నింపాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఇన్‌చార్జ్ మున్సిపల్ మేనేజర్ ఆర్‌వీ అప్పారావును కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణంలోని తారకరామా చెరువు, దాని చుట్టూ ఉన్న వాకింగ్ ట్రాక్ పట్టణ ప్రజలకు సేద తీర్చుకునేందుకు, ఆహ్లాదాన్ని ఇచ్చే ముఖ్యమైన వనరుగా ఉందన్నారు. ప్రస్తుతం చెరువులో నీరు లేక ఎండిపోయిందన్నారు. ఎన్ఎస్పీ కాలువల ద్వారా నీరు వృధాగా వాగులకు పోతుందని, కాలువల నీటిని తారకరామా చెరువుకు మళ్లించితే వాతావరణం చల్లబడుతుందన్నారు. భూగర్భ జలాల మట్టం పెరుగుతుందన్నారు. అక్కడకు వచ్చే ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తుందన్నారు. వృధాగా పోయే ఎన్ఎస్పీ కాలువల నీటితో తారకరామా చెరువును నింపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



ఇన్‌చార్జ్ మున్సిపల్ మేనేజర్ అప్పారావుకు వినతి పత్రం అందిస్తున్న గద్దె చలమయ్య